అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా అమలు

ఉమ్మడదేవరపల్లి(గంపలగూడెం): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత గడచిన నాలుగేళ్లుగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను సమాంతరంగా అమలు పరుస్తూ ప్రజల ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతుందని తిరువూరు శాసన సభ్యుడు కె.రక్షణనిధి తెలిపారు. గంపలగూడెం మండలం నెమలి సచివాలయం పరిధిలోని ఉమ్మడదేవరపల్లిలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. శాసన సభ్యుడు రక్షణనిధి మాట్లాడుతూ విభజన ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను మాట తప్పకుండా నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమం, అభివృద్ధి పథకాలు కొనసాగాలంటే వచ్చే సాధారణ ఎన్నికల్లో మరో మారు ఓటర్లు వైఎస్సార్‌సీపీని బలపర్చాల్సి ఉందన్నారు. అంతకుముందు గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ఆయా కుటుంబాలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా అందిన లబ్ధిని వివరించడంతో పాటుగా వివరాలతో ముద్రించిన కరపత్రాలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. గ్రామస్తుల విన్నపం మేర అవసరమైన చోట కరెంటు స్తంభాల ఏర్పాటు, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామన్నారు. కిందకు వేలాడుతూ ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ ప్రధాన వైర్లకు మరమ్మతులు వెంటనే చేపట్టాలని విద్యుత్‌శాఖ ఇంజినీర్ ను ఎమ్మెల్యే ఆదేశించారు. గ్రామంలో మంచినీటి అవసరాలను తీర్చాలని ప్రజల విజ్ఞప్తి మేరకు సచివాలయం నిధులు రూ.ఐదు లక్షలతో ఆర్వో ప్లాంట్ నిర్మిస్తామన్నారు. ఎస్సీ కాలనీలో బోరు తవ్వకానికి నిధులు విడుదల చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు కోట శామ్యూల్, సర్పంచ్ తోటకూర వీర ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు కుంభగిరి వెంకటకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు కావూరి వినయ్‌కుమార్, గోగులమూడి చెన్నకేశవరెడ్డి, చెరుకు నరసారెడ్డి, ఆలపాటి ఉమామహేశ్వర రావు, మాజీ ఎంపీపీ కోట దాసు, మాజీ సర్పంచ్ బి.శ్రీలక్ష్మి, నెమలి సర్పంచ్ దుబ్బాకుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఉమ్మడదేవరపల్లిలో సంక్షేమ పథకాల బ్రోచర్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

నేడు నెమలిలో గడపగడపకు మన ప్రభుత్వం
మండలంలోని నెమలి లో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుంది.

క్లుప్తంగా

1నుంచి వేసవి క్రీడా శిక్షణ

జి.కొండూరు: స్థానిక శాగం శివరామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మే 1వ తేదీ నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్నట్లు పాఠశాల హెచ్‌ఎం రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పీడీ సీజర్ రెడ్డి, పీఈటీ మాధవరావు ఆధ్వర్యంలో జరిగే ఈ శిబిరంలో వాలీబాల్, హ్యాండ్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, టెన్నీకాయిట్ క్రీడలలో శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. ఆసక్తి కలిగిన 15 సంవత్సరాల లోపు బాల, బాలికలు ఈ శిబిరంలో పాల్గొని శిక్షణ పొందవచ్చని చెప్పారు.

యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ

ఇబ్రహీంపట్నం: ఏబీసీ సర్వీసెస్ ఆధ్వర్యంలో స్థానిక గ్రేస్ ఆఫ్ క్రైస్ట్ మినిస్ట్రీస్ చర్చిలో యువత, చిన్నారుల నైపుణ్య అభివృద్ధిలో శిక్షణ సదస్సు గురువారం జరిగింది. సేవాభారత్ రాష్ట్ర కోఆర్డినేటర్ శివారెడ్డి, జిల్లా కోఆర్డినేటర్ సురేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్య, ఆధ్యాత్మిక, మానసిక, సామాజిక అభివృద్ధిపై సలహాలు, సూచనలు ఇచ్చారు. నైతిక విలువల గురించి తెలియజేశారు. చిన్నారులు ఆటపాటలతో ఆలరించారు. ఏబీసీ సర్వీసెస్ డైరెక్టర్ వల్లూరు ఆశప్ కుమార్, పలువురు పాస్టర్లు, యువకులు, చిన్నారులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల స్వచ్ఛభారత్

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి సాయి చంద్రనగర్‌లో జాకీర్‌హుస్సేన్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వలంటీర్లు గురువారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ మహాబాషా మాట్లాడుతూ గ్రామాల్లో పరిశుభ్రం, పచ్చదనంతో స్వచ్ఛ భారత్ సాధించవచ్చన్నారు. ఇటువంటి కార్యక్రమాలతో ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందన్నారు. 28వ వార్డు కౌన్సిలర్ కౌసర్ బేగం మాట్లాడుతూ కొండపల్లి అభివృద్ధిలో భాగస్వాములైన వలంటీర్లను అభినందించారు. రోడ్లు ఊడ్చి ముళ్లపొదలు, చెత్త తొలగించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు పంపిణీ

పెనుగొలను(గంపలగూడెం): గంపలగూడెం మండలం పెనుగొలనులో గురువారం సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక ఎలిమెంటరీ పాఠశాలల్లో హాజరుశాతం ఎక్కువగా ఉన్న ఆరుగురు విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను పంపిణీ చేశారు. ఆయా విద్యార్థులను తులాభారం వేసి బియ్యం, నోటు పుస్తకాల కిట్లు, పోషకాహార కిట్, వివిధ రకాల కూరగాయలను పూర్వ విద్యార్థి పరుచూరి హరి మాధవ గుప్తా సౌజన్యంతో అందజేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు నూతన వస్త్రాలు కప్పి ఘనంగా సన్మానించారు.

ట్రాక్టర్ ప్రమాదంలో యువకుడికి గాయాలు

జి.కొండూరు: ట్రాక్టర్ ప్రమాదంలో యువకుడు గాయపడిన ఘటన వెలగలేరు గ్రామ శివారులో గురువారం చోటుచేసుకుంది. వివరాలలోకి వెళ్తే...మండలంలోని ముత్యాలంపాడు గ్రామానికి చెందిన కర్ల రామకృష్ణ గురువారం సాయంత్రం వెలగలేరు గ్రామ శివారులోని జగనన్న కాలనీ ఇళ్లకు మట్టిని తరలిస్తున్న ట్రాక్టరుపై ఎక్కి డ్రైవర్ పక్కన కూర్చున్నాడు. ఈ క్రమంలో ట్రాక్టరు గోతుల్లో కుదుపులకు లోనవడంతో డ్రైవర్ పక్కన కూర్చున్న రామకృష్ణ కిందపడిపోయాడు. ట్రాక్టరు టైరు రామకృష్ణ నడుము పైకి ఎక్కడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ధర్మరాజు తెలిపారు.

పీఎఫ్ సమస్యల పరిష్కారానికి కృషి

ఆగిరిపల్లి: పీఎఫ్ సభ్యులు, పెన్షనర్లు, యాజమాన్య ప్రతినిధుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఉమ్మడి కృష్ణా జిల్లా పీఎఫ్ నోడల్ అధికారి పి.జవహర్‌లాల్ అన్నారు. మండలంలోని నెక్కలం గొల్లగూడెంలో కుశలవ ఇంటర్‌నేషనల్ కంపెనీలో గురువారం పీఎఫ్ సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు.

కొండపల్లిలో పర్యటించిన సబ్ కలెక్టర్

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి, సబ్ కలెక్టర్ అదితిసింగ్ మున్సిపాలిటీలో గురువారం ఆకస్మికంగా పర్యటించారు. 2వ వార్డు ఏబీఎంపేట స్థానికులు ఆ ప్రాంత సమస్యలపై స్పందనలో ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఆమె ఆ ప్రాంతంలో పర్యటించారు. దాదాపు గంటపాటు ఏబీఎంపేటలో తిరిగారు. రోడ్లు, డ్రైనేజీలు, కమ్యూనిటీ హాల్ నిర్మించాలని అక్కడి ప్రజలు సబ్‌కలెక్టర్ దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆమె ప్రాధాన్యతా క్రమంలో సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లుకు సూచించారు. సబ్‌కలెక్టర్ స్పందించిన తీరుకు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కమిషనర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ ఏఈ సాయిగణేష్ తదితరులు పాల్గొన్నారు.



కొండపల్లి ఏబీఎంపేటలో ప్రజల ద్వారా సమస్యలు వింటున్న సబ్‌కలెక్టర్ అదితిసింగ్

దర్గా సందర్శించిన మైనార్టీ కమిషన్ చైర్మన్

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలో ప్రసిద్ధి గాంచిన సయ్యద్ షాబూఖారీ దర్గా రాష్ట్ర ముస్లిం మైనార్టీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్ మహ్మద్‌ఖాన్ బుధవారం రాత్రి సందర్శించారు. ఆస్థాన పీఠాధిపతి మహ్మద్ అల్తాఫ్ రజా, ముజావర్లు ఆయనకు సాదరస్వాగతం పలికారు. బాబాకు పూలు, చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. షాబుఖారీ బాబా మహిమలు తెలుసుకుని దర్గాను సందర్శించినట్లు తెలిపారు. అన్నదానంతో పేదల కడుపు నింపుతున్న ఆల్తాఫ్ రజా సేవలు అభినందనీయం అన్నారు. అన్యాక్రాంతమైన వక్ఫ్ ఆస్తుల విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానన్నారు. ఆస్తుల పరిరక్షణకు తన వంతు కృషిచేస్తానని చెప్పారు. ప్రభుత్వ ఖాజీ హబీబుల్లా హుసేనీ, కౌన్సిలర్ కౌసర్‌బేగం, భవానీపురం 41వ డివిజన్ కౌన్సిలర్ ఎండీ ఇర్ఫాన్, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.



కొండపల్లి షాబుఖారీ దర్గాలో ప్రార్థన చేస్తున్న రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్ మహ్మద్‌ఖాన్

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికే సామాజిక తనిఖీ

నూజివీడు: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికే రాష్ట్ర ప్రభుత్వం సామాజిక తనిఖీ (సోషల్ ఆడిట్) నిర్వహిస్తోందని స్టేట్ రిసోర్స్ పర్సన్ వీవీఎస్‌ఆర్ ప్రసాద్ అన్నారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులకు సామాజిక తనిఖీపై గురువారం పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్‌లో ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్ ప్రసాద్ హెచ్‌ఎంలకు శిక్షణ ఇచ్చారు. పాఠశాలల్లో ఇప్పటివరకు చేపట్టిన కార్యకలాపాలను పరిశీలించడంతో పాటు భవిష్యత్‌లో ఏ మేరకు పనులు చేపట్టాలనేది పేరెంట్స్ కమిటీల భాగస్వామ్యంతో సమగ్ర ప్రణాళికను పాఠశాల స్థాయిలో తయారు చేసుకోవాలన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా చేపట్టే కార్యక్రమాలకు ఏ మేరకు నిధులు అవసరమనేది సమగ్ర నివేదికను రూపొందించాల్సి ఉంటుందన్నారు. పరిశీలకులుగా ఏఎంవో పి.భాస్కర్, సీఎంవో సి.రవీంద్ర వ్యవహరించగా, కోర్సు డైరెక్టర్ ఎంఈవో బి.వెంకటేశ్వర్లు, రిసోర్స్ పర్సన్ అమరయ్య పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు సోషల్ ఆడిట్‌పై శిక్షణ ఇస్తున్న స్టేట్ రిసోర్స్ పర్సన్ ప్రసాద్

ఇంటర్ ఫలితాల్లో శ్రీసిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ

నూజివీడు: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో పట్టణంలోని శ్రీ సిద్ధార్థ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయదుందుభి మోగించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీలో ఎస్.నవ్య 466, జి.మునిష్ కుమార్, ఎన్‌వీఎస్ నందిని 465, వి.గంగ 464, ఎస్.జగదీష్ 463 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ఎంపీసీ గ్రూప్‌లో కె.సాయి గీతిక 987, బైపీసీ గ్రూపులో బి.సుజిత 977 మార్కులు సాధించారు. అత్యుత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను శ్రీసిద్ధార్థ విద్యా సంస్థల చైర్మన్ మేడా మోహన్‌రావు, డైరెక్టర్లు గొల్లపూడి రవిబాబు, తోటకూర సాంబశివ రావు, కళాశాల కరస్పాండెంట్ మోరంపూడి సత్యనారాయణ, కళాశాల అధ్యాపక బృందం అభినందించారు.

వెల్వడం సొసైటీ సభ్యురాలు కోటేశ్వరమ్మ మృతి

వెల్వడం(మైలవరం): మండలంలోని వెల్వడం గ్రామ సహకార పరపతి సంఘం సభ్యురాలు కుందేటి కోటేశ్వరమ్మ గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వెల్వడం సొసైటీ అధ్యక్షుడు తోట తిరుపతిరావు, సీఈఓ ఎం.సాంబశివరావుతో కలిసి మృతురాలి ఇంటికి వెళ్లి నివాళులర్పించారు. సొసైటీ తరఫున కోటేశ్వరమ్మ కుటుంబ సభ్యులకు రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

నేడు కౌన్సిల్ సమావేశం

తిరువూరు: తిరువూరు నగర పంచాయతీ కౌన్సిల్ అత్యవసర సమావేశం శుక్రవారం ఉదయం జరుగుతుందని కమిషనర్ బాలకృష్ణ తెలిపారు. ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ అధ్యక్షతన జరిగే సమావేశంలో పలు వార్డుల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులపై చర్చించి తీర్మానిస్తారన్నారు.

పారిశుద్ధ్య పనులకు అధిక ప్రాధాన్యం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం పనులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న పారిశుద్ధ్యం పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఉదయం 6గంటలకు వచ్చి పారిశుద్ధ్య కార్మికుల హాజరు పరిశీలించారు. అమెరికన్ వైద్యశాల, బీకాలనీ ప్రాంతాల్లో రోడ్లపై చెత్త ఏరివేసి ట్రాక్టర్‌ల ద్వారా డంపింగ్ యార్డ్‌కు తరలించే పనులు పరిశీలించారు. ప్రజారోగ్యానికి ఇబ్బందులు లేకుండా సకాలంలో పారిశుద్ధ్యం పనులు చేపట్టాలని కార్మికులకు సూచించారు.



కొండపల్లిలో పారిశుద్ధ్యం పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు

రోడ్లపై చెత్త వేస్తే అపరాధ రుసుం

గంపలగూడెం: మండల కేంద్రమైన గంపలగూడెంలో ప్రధాన రహదారులపై చెత్త వేస్తే అపరాధ రుసుం విధిస్తామంటూ గ్రామ పంచాయతీ ఈఓ జి.శ్రీనివాసరెడ్డి గురువారం వ్యాపారస్తులు, కుటుంబీకులకు నోటీసులు జారీ చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి గ్రామ శివారు శిరిడి సాయిబాబా ధ్యాన నిలయం వరకు మెయిన్ రోడ్డు వెంట, బస్‌స్టాప్ సెంటర్ నుంచి జెండా రావి చెట్టు వరకు రహదారి ఇరువైపులా ఉన్న దుకాణాలు, గృహస్తులు రోడ్లపై చెత్త వేస్తున్నట్లు పంచాయతీకి ఫిర్యాదు అందిందన్నారు. ప్రజారోగ్యం దృష్ట్యా నిబంధనల ప్రకారం చెత్తా చెదారాన్ని ప్రజలు డస్ట్ బిన్ ఏర్పాటు చేసుకొని ప్రతి రోజు ఉదయం పారిశుద్ధ్య సిబ్బందికి మాత్రమే అందజేయాల్సి ఉందన్నారు. విరుద్ధంగా వ్యవహరించిన వారిపై ఇకపై రూ.2వేలు అపరాధ రుసుం విధిస్తారంటూ నోటీసులు జారీ చేశారు. నోటీసులను బిల్ కలెక్టర్ షేక్ కరీముల్లా అందజేశారు.

నూరుశాతం రుణాల రికవరీకి కృషి చేయాలి

కేడీసీసీ బ్యాంకు చీఫ్ మేనేజర్ శ్రీనివాసరావు

గంపలగూడెం: 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మెంబర్ లెవల్లో నూరుశాతం రుణాల రికవరీకి సొసైటీల సిబ్బంది కృషి చేయాలని గంపలగూడెం కేడీసీసీ బ్యాంకు చీఫ్ మేనేజర్ తెనాలి శ్రీనివాసరావు తెలిపారు. గంపలగూడెం కేడీసీసీ బ్యాంకులో గురువారం మండల పరిధిలోని సొసైటీల సీఈఓలతో రుణాల రికవరీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు పరిధిలోని 12 సొసైటీల నుంచి మెంబర్ లెవెల్ డిమాండ్ రూ.132.72 కోట్లు ఉండగా ఇప్పటివరకు రూ.124.75 కోట్లు వసూలయ్యాయన్నారు. మిగిలిన మొత్తం కూడా వసూలుకు సిబ్బంది రైతులను వ్యక్తిగతంగా కలిసి వసూలు చేయాలన్నారు.

గంపలగూడెం, కొణిజెర్ల సొసైటీలకు అభినందన
ఇప్పటివరకు గంపలగూడెం, కొణిజెర్ల సొసైటీలు ఈ ఏడాది నూరుశాతం వసూలు చేసిన సొసైటీలుగా నిలిచాయన్నారు. సంబంధిత సొసైటీల పాలకవర్గం, సీఈఓలను, సిబ్బందిని చీఫ్ మేనేజర్ అభినందించారు. మేనేజర్ కంచర్ల కనకదుర్గ, సత్యనారాయణ, అసిస్టెంట్ మేనేజర్ మంగలక్ష్మి, సూపర్‌వైజర్లు మల్లాది ఏసోబు, కొండయ్య, సీఈఓ, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ప్రతిభ

తిరువూరు: ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో తిరువూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ మురళీకృష్ణ తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ ఫిషరీస్‌లో జి.సాయికృష్ణ సాగర్ 1000 మార్కులకు 941, హెచ్‌ఈసీ గ్రూపులో ఆదూరి స్వప్న 917 మార్కులు సాధించినట్లు తెలిపారు.



సాగర్



స్వప్న

పలువురు విద్యార్థులు ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులైనట్లు తెలియజేశారు. తిరువూరు శ్రీనిధి జూనియర్ కళాశాలలో ఎంపీసీ విభాగంలో భీమా రోహిత్ 987, బైపీసీలో అంకిరెడ్డి వర్ష 987, సీఈసీ విభాగంలో గంటి ఉమ 946 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు.

పాఠశాలల్లో సామాజిక తనిఖీ నిర్వహించాలి

తిరువూరు: మండలంలోని అన్ని పాఠశాలల్లో సామాజిక తనిఖీ నిర్వహణపై ప్రభుత్వం మార్గదర్శకాలు జారీచేసిందని తిరువూరు ఎంఈవో రామకృష్ణ తెలిపారు. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో గురువారం పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ 28న అన్ని పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశం జరపాలని, ఈ ఏడాది జరిగిన విద్యాపరమైన కార్యక్రమాలు, పిల్లల ప్రగతిని తెలియజేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. స్కూళ్లలో నాడు–నేడు నిధులతో చేసిన అభివృద్ధి పనులు, విద్యాపరంగా చేపట్టిన సంస్కరణలను తెలియజేయాలన్నారు. వచ్చే విద్యాసంవత్సరంలో విద్యార్థుల చేర్పింపునకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. రిసోర్సు పర్సన్లు వీరభద్రరావు, చంద్రం, కోకిలంపాడు, ముష్టికుంట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గుప్తా, కేశవరావు పాల్గొన్నారు.



తిరువూరు మండల హెచ్‌ఎంల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో రామకృష్ణ

సంక్షిప్తం

■ మే 10 కల్లా పాఠశాలలకు కిట్లను పంపాలి
నూజివీడు: జగనన్న విద్యాకానుక కిట్లను మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు మే పదో తేదీ నాటికల్లా పంపిణీ పూర్తి చేయాలని సీఎంవో జె.రవీంద్ర సూచించారు. స్థానిక ఎంఈవో కార్యాలయంలో గురువారం జగనన్న విద్యాకానుక కిట్లకు సంబంధించి మండల కమిటీ కో–ఆర్డినేషన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిట్లు వచ్చిన తరువాత వాటిని క్షుణ్ణంగా పరిశీలించి పాడైపోయినవి ఉంటే వాటి వివరాలను వెంటనే సంబంధిత యాప్‌లో నమోదు చేయాలన్నారు. సీఆర్పీలు ఎప్పటికప్పుడు సమాచారాన్ని హెచ్‌ఎంలకు తెలియజేయాలన్నారు. సమావేశంలో ఎంఈవో బి.వెంకటేశ్వర్లు, సీఎంవో ఏవీఎస్‌ఎన్ భాస్కరకుమార్, ఏఈ కృష్ణ, ఏపీఎం దయాల రాజశేఖర్ పాల్గొన్నారు.

■ విద్యా సహాయకులకు శిక్షణ
గంపలగూడెం: నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశం పొందేలా సిబ్బంది కృషి చేయాలని ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. గంపలగూడెం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆంధ్రప్రదేశ్ నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు శిక్షణ, ఉద్యోగావకాశాలపై సచివాలయాల విద్యా సహాయకులు, వలంటీర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ కో– ఆర్డినేటర్ కె.నరేష్ శిక్షణ కోసం నిరుద్యోగుల నమోదుపై అవగాహన కల్పించారు.

■ దాసరి కి నివాళి
నూజివీడు: భూపోరాట యోధుడిగా, ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేసిన నాయకుడిగా దాసరి నాగభూషణరావు చరిత్రలో నిలిచిపోయారని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అన్నారు. సీపీఐ జాతీయ నాయకుడు దాసరి నాగభూషణరావు 15వ వర్ధంతిని పట్టణంలోని అమర్ భవన్‌లో గురువారం నిర్వహించారు. దాసరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఐ రాష్ట్ర సమితి నాయకులు చలసాని వెంకట రామారావు, నియోజకవర్గ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు, సీపీఎం నాయకులు జి. రాజు, సీపీఐ నాయకులు గుంటక ధర్మారెడ్డి, రాయంకుల లక్ష్మణరావు, అక్కినేని వరప్రకాశరావు, ఈమని శేషయ్య పాల్గొన్నారు.

తిరువూరు: కమ్యూనిస్టు యోధుడు దాసరి నాగభూషణరావు 15వ వర్ధంతి గురువారం తిరువూరు సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. దాసరి చిత్రపటానికి పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు తూము కృష్ణయ్య, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి వెంకటేశ్వరరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

■ అనారోగ్యంతో గ్రామ వలంటీర్ మృతి
ముసునూరు: వలంటీరు ఆకస్మికంగా మృతి చెందడంతో ఆ ప్రాంతమంతా తీవ్ర విషాదంలో మునిగి పోయింది. పూర్తి వివరాల్లోకి వెళితే మండలంలోని చెక్కపల్లి గ్రామంలో 13వ వార్డుకు చెందిన 5వ క్లస్టర్ గ్రామ వలంటీరు చంద్రు దుర్గ (35) గత కొద్ది రోజుల క్రితం అనారోగ్యం బారిన పడింది. కుటుంబ సభ్యులు ఏలూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. స్థానిక ఎంపీటీసీ సభ్యులు తోట రమాదేవి మురళి, ఉప సర్పంచ్ పద్మజా దేవేంద్ర, గ్రామానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు గురువారం ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

■ పేద ప్రజలపై భారం మోపుతున్న కేంద్ర ప్రభుత్వం
మైలవరం: పేద ప్రజలపై అధిక భారం మోపుతున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సీపీఎం మైలవరం మండల నాయకుడు సీహెచ్ సుధాకర్ తెలిపారు. సీపీఎం ఆధ్వర్యంలో మైలవరం అయ్యప్పనగర్, తైదుపాడు రోడ్డు, టీఆర్ నగర్, మార్కెట్ యార్డు ప్రాంతాల్లో గురువారం కరపత్రాల ప్రచారం ముమ్మరంగా నిర్వహించారు. కార్యక్రమంలో షేక్ బాబు, మొక్కలకత్తి చరణ్, పూర్ణ, నాని తదితరులు పాల్గొన్నారు.

■ ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలి
గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రైవేటీకరణ నుంచి ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పార్టీ చేపట్టిన ప్రచారభేరి కార్యక్రమం 14వ రోజు గురువారం గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపు వద్ద నిర్వహించారు. ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు దేశాన్ని కాపాడుకునేందుకు బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలన్నారు. నియోజకవర్గ కార్యదర్శి బుడ్డి రమేష్, సీపీఐ, ఏఐటీయూసీ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

■ మామిడి ఎగుమతి కేంద్రాల పరిశీలన
విస్సన్నపేట: మామిడి కాయల ఎగుమతి కేంద్రాల్లో ప్యాకింగ్‌ను జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ గురువారం పరిశీలించారు. మండలంలోని చంద్రుపట్ల గ్రామంలో ఉన్న రెండు కేంద్రాల్లో ఉప్పులో మామిడి ముక్కలు ఊరవేయటానికి వాడుతున్న ఉప్పు నాణ్యతా ప్రమాణాలకు సంబంధించి శ్యాంపిల్స్ తీశారు. వాటిని టెస్టింగ్‌కు పంపుతున్నట్లు తెలిపారు.

■ ముగిసిన ఉరుసు మహోత్సవాలు
ఎ.కొండూరు: మండలంలోని చీమలపాడు గ్రామంలో ఈనెల 24 నుంచి ఘనంగా ప్రారంభమైన ఉరుసు ఉత్సవాలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా దివ్య ఖురాన్ పారాయణం, ఉరుసు సంధల్, సూఫీ మహద్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరి బాబా వారి దర్గాలో పవిత్ర పుష్పాంజలి నిర్వహించి సూఫీ సుగంధం సంధల్ ఊరేగింపు, పవిత్ర పతాక ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. అమ్మజాన్ దర్గా వద్దకు మేళతాళాలతో భారీ ఊరేగింపు చాదర్, పూలు, సంధల్ సమర్పించి ప్రార్థనలు చేశారు. ఉరుసు మహోత్సవాల్లో మూడు రోజులు అన్న సమారాధాన కార్యక్రమం నిర్వహించారు. ఉరుసు మహోత్సవానికి వచ్చిన భక్తులు ప్రసాదాన్ని స్వీకరించి అమ్మజాన్ దర్గా వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.

■ ఘనంగా భగీరథ జయంతి
ముసునూరు: మండల కేంద్రం ముసునూరులో భగీరథ జయంతి ఘనంగా నిర్వహించారు. స్థానిక సగర సంఘం ఆధ్వర్యంలో గురువారం రాత్రి భగీరథుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

■ తెల్లదోమ నివారణపై శిక్షణ
నూజివీడు: రైతుభరోసా కేంద్రాల్లో పని చేస్తున్న వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు సర్పిలాకార తెల్లదోమ నివారణపై తుక్కులూరు రైతు భరోసా కేంద్రంలో గురువారం ఉద్యాన అధికారి రాజులపాటి హేమ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

భవిష్యనిధిపై అవగాహన

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్టీఆర్ జిల్లాలో నిధి ఆప్కే నికట్‌లో భాగంగా విజయవాడ పీఎఫ్(భవిష్య నిధి) కార్యాలయం అధికారులు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ శేఖర్ శర్మ మాట్లాడుతూ ప్రావిడెంట్ ఫండ్ ద్వారా కలిగే ప్రయోజనాలు వివరించారు. ఈపీఎఫ్ సేవలన్నీ ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చని, పీఎఫ్ మెంబర్ సర్వీసులో ఉండగా మృతి చెందితే సదరు సభ్యుని కుటుంబ సభ్యులు ఈపీఎఫ్ లింక్డ్ ఇన్సూరెన్స్ బెనిఫిట్‌కు ఏ విధంగా అర్హులవుతారో తదితర విషయాలు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు సమావేశానికి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.హరినాథరెడ్డి, పీఎఫ్ ఆఫీస్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డిపో మేనేజర్

ఇబ్రహీంపట్నం: స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలో తిరిగే ఆర్టీసీ సర్వీసుల సేవలపై శుక్రవారం డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఎ.సుబ్రహ్మణ్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపో పరిధి లోని బస్ సర్వీసుల్లో సమస్యలు, సలహాలు ఇవ్వాలని సూచించారు. ఉదయం 11 గంటల నుంచి 12గంటల మధ్య 99592 25457 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. ప్రయాణికులు, ప్రజలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.

శాస్త్రోక్తంగా గోపురం విసర్జన

గోసవీడు(గంపలగూడెం): గోసవీడులో గంగా పార్వతీ సహిత విశ్వేశ్వరస్వామి, అమ్మవార్ల విగ్రహాలను, గోపురాల విసర్జన కార్యక్రమం గురువారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.